# నశ్యమహాసభ

"ఈశ్వర"

అఖిలభారత నశ్యమహాసభ మైలపూరులో మహావైభవంగా జరిగింది. భారతదేశపు నలుమూలలనుండీ ప్రతినిధులు సమావేశానికి వచ్చారు. శాంథోమ్ కు పోయేదార్లో ఒక పెద్ద భవనం తాలూకు దొడ్డిలో, మహాసభకై పెద్ద పందిరి వేయబడింది. సభనిండా మెర్క్యురీట్యూబులూ, రంగురంగుల అడ్వర్టయిజుమెంటులూ, ముచ్చట గొల్పేలాగా అలంకరింపబడ్డాయి. సభాతలాన పెద్దవేదిక-దానికి కుడివైపున పత్రికలవారికి ఏర్పాటు చేయబడింది. ఎడమవైపు మహారాజు పోషకులకు ప్రత్యేకించారు.

మద్రాసులో నశ్యం తయారుచేసే సంస్థలన్నీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొన్నాయి. రంగురంగుల పోస్టర్లను సభాప్రాంగణంలో అలంకరింపచేశారు. సమావేశంరోజున ఆ కంపెనీలవారందరూ ప్రతికల్లో ఎడ్వర్టైజుమెంటులుకూడా ఇచ్చారు. ఇటీవల హైద్రాబాదులో ఎగ్జిబిషను జరిగినప్పుడు వారికి ప్రథమ బహుమతి లభించినవైనం, ఆ సందర్భంలో అక్కడి ఏజంటు హైద్రాబాదు మేయరుతో కలిసి తీయించుకొన్న ఫోటో, త్రివర్ణాలతో మొదటిపేజీలో ముద్రింపబడ్డాయి. కొన్ని కంపెనీ లానాడు నశ్యాన్ని కన్సెషను రేటుకుకూడా చిల్లరగా విక్రయించాయి.

దేశం మొత్తంమీద నశ్యాన్ని విరివిగా వాడేది దాక్షిణాత్యులేగనుక, ప్రథమ మహాసభాధ్యక్షులు దాక్షిణాత్యులే కావాలని, నిర్వివాదంగానే తేల్చబడింది. కుంభకోణం డెలిగేటు రంగయ్యంగారు మహాసభకు అధ్యక్షుడుగా ఎన్నిక అయ్యారు. మైలాపూర్ *Snuff Takers Union* (*S. T. U.*) (పొడుం పీల్చే పెద్దల సంఘం) శాశ్వతాధ్యక్షులు వెంకని శివయ్యార్ ఆహ్వాన సంఘాధ్యక్షులుగా పట చేశారు.

మొదట ఆహ్వాన సంఘాధ్యక్షులు లేచి మాట్లాడుతూ, ప్రథమనశ్యమహాసభ మైలపూర్లో జరగటం చాలా సముచితమన్నారు. నశ్యాభిమానులకు నేటికి సభద్వారా గౌరవం కలగడంచూచి ఆయన చాలా గర్వించారు.

తరువాత సభాప్రారంభకులు ఉపన్యాసం మొదలుపెట్టారు. మొదట వారు చారిత్రకంగా నశ్యాన్నిగూర్చి ప్రస్తావిస్తూ, నశ్యం చాలా పురాతనంగా వస్తున్న గొప్ప టానిక్కనిన్నీ, దాని విలువ బ్రిటిషు హయాంలోనే కొంతవఱకు కించపరుపబడిందనిన్నీ అన్నారు. స్వరాజ్య సాధనానంతరం దీనికి సముచితస్థానం లభించగలదని తాము ఆశించామనీ, కాని జాతీయ ప్రభుత్వం దీనినిగూర్చి శ్రద్ధ తీసుకోకపోవడం చాలా శోచనీయమనీ అన్నారు. ఇకముందుకూడా ఇట్లాగే అశ్రద్ధచేస్తే, ఈ పరిశ్రమ కూడా క్షీణించిపోగలదనే భయాన్ని కూడా వెలిబుచ్చారు. నశ్యం ప్రతివారికీ అందుబాటులో ఉంటున్నా కూడా, చాలామంది యువకులు సిగరెట్లపై మోజుపడడం తమకు ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. ఇటువంటి దుర్లక్షణాలను రూపుమాపాలంటే, సిగరెట్టు, బీడీలమీద ప్రత్యేకపు పన్ను విధించడంకన్న, మరేమీ గత్యంతరం లేదన్నారు.

తరువాత ఆయన ఈ అఖిలభారత సంఘాన్ని ఏయే పద్ధతులమీద నడిపించాలీ అన్న విషయంపై ప్రస్తావిస్తూ, కొన్ని విలువైన సూచనలు చేశారు. ఈ సంఘానికి ముఖ్యమైన నశ్యపు కంపెనీలన్నీ కొంత ధనసహాయం చేయాలనీ, దీనికి ప్రభుత్వం కూడా సబ్సిడీల నియ్యవలసి ఉంటుందనీ అన్నారు. ఈ అఖిలభారత సంఘం (1) పబ్లిసిటీ (*Publicity*)

(2) రిసెర్చి (*Research*)

(3) సేల్సు (*Sales*)

అనే మూడు శాఖలుగా వ్యవహరించడంబాగుంటుందని సూచించారు.

తరువాత హర్షధ్వనులు చెలరేగుతూండగా సభాధ్యక్షులు లేచారు. వీరు లేచి నిలుచోగానే వివిధ ప్రతికల *Staff Photographers* ఫొటోలుతీసుకొన్నారు. అధ్యక్షులు ఉపన్యాసం మొదలుపెడ్తూ, అది ప్రథమమహాసభ కనుక, అధ్యక్షోపన్యాసం సాధ్యమైనంత క్లుప్తంగా వుండాలని తాము అభిప్రాయపడ్తున్నామన్నారు. ఉపన్యాసం తేలికగా జ్ఞాపకముండేలాగు (తమకూ, శ్రోతలకీ కూడా), దాన్ని పద్యీకరించామని చెప్పి, చదవడం మొదలుపెట్టారు.

"పొడుంకోసం చచ్చిపోదాం!
పొడుంలేనిది బ్రతుకు దేనికి ?
ఓ చిటికె పొడుమును పీల్చి చూడూ,
పొడుం పీల్చని పిచ్చివాడా!
పొడుం కాదా తెలివి నిస్తా
తమిళ దేశపు తంబిగాళ్ళకు * ?

---

* ఈ మాటను అధ్యక్షులు స్వోత్కర్షగానే అన్నారు. కాని అనువాదంలో మరోభావాన్ని ఇచ్చినట్లయితే అనువాదకుడు క్షంతవ్యుడు.

---

పెద్దమిల్లు యజమాని ఒకాయన నాలుగేళ్ల తరువాత యీ వేసవి కాలానికి కొడైకెనాల్ కు వెళ్లాడు. అక్కడ ఆయన భార్య పిల్లలతో హాయిగా కాలం గడుపుతూ వుండగా, ఆయన తాలూకు మిల్లు వుద్యోగి ఒకడు ఆయనకు ఒక వుత్తరం వ్రాశాడు. అందులో యిలా వున్నది.

"మీరు మీ కుటుంబం అక్కడ హాయిగా నిశ్చింతగా కాలం గడుపుతున్నారని ఆశిస్తున్నాను. ఇక్కడ మన ఫ్యాక్టరీలో మే మందరమూ హాయిగా వుంటున్నాము!!

పొడుం పీలిచి బాగుపడవోయ్
పొడుం పీల్చని పిచ్చివాడా!
మేటియైనది 'లవండరు స్నఫ్'
చులుకు నిచ్చును, మంచి వాసన
దుర్గుణాలే లేవు దీనికి
వాడి మేలును పొందవోయ్."

రంగయ్యంగారు ముగించి కూర్చున్నారో, లేదో సభలో పెద్ద దుమారం చెలరేగింది.

ఒక అభ్యుదయ నశ్య ప్రేమి లేచి, దేశం పురోగమించడానికి తీవ్రంగా కృషి చేస్తూంటే, రంగయ్యంగారు పద్యంలో ఉపన్యసించడం తాము తీవ్రంగా నిరసిస్తున్నా మన్నారు. 'ఉక్కారు', 'ఉక్కారు' అని నాలుగువేపులనుంచీ కేకలురావడంతో, ఆయన మళ్లీ మాట్లాడ లేదు.

ఇంతట్లో మరొకరులేచి, ఉపన్యాసం తేలికగా గుర్తుండటానికి, అధ్యక్షులవారు పద్య సందేశాన్నియడం, సబబేనని సమర్థించారు.

ఇంతట్లో 'ఆంధ్ర' నుండి వచ్చిన ఒక డెలిగేటు వెంకట నరశింహాచారిగారులేచి 'లవండరు' నశ్యం, కేవలం ఒక కంపెనీ వారు తయారుచేసే ఒకనస్యవిశేషమనీ దాన్ని గూర్చి చివరలో ఉద్బోధించడం ప్రెసిడెంటుగారి పక్షపాత దృష్టికి తార్కాణమనీ, ఆయన ఇట్లా చేయడానికి, వెనుక ఏదో ఉన్నట్లు తమకు సందేహాంగా వుందనీ సభకు తెలియచేశారు.

సెక్రటేరియట్ నశ్యపోషక సంస్థ ప్రతినిధి లేచి, నశ్యం ఈమధ్య తన ఉచిత స్థానాన్ని కోల్పోటానికి కొంతవరకు దాని దుర్వాసన కారణం కావచ్చన్నారు. అటువంటి దుర్వాసనా రహితమైన దాన్ని గూర్చి ప్రస్తావించడం, అటు మహత్తర నశ్య ప్రాశస్త్యాన్నీ, ఇటు నూతన సమస్యనీ, సమన్వయ పరచడమే నన్నారు. ఇటువంటి సమర్థులు మొదటి అధ్యక్షుడు కావడం, ఈ సంస్థకు గల ఉజ్వల భవితవ్యాన్ని సూచిస్తున్నదన్నారు. ఈ 'లవండర్ స్నఫ్' ఎవరైనా కావచ్చుననీ, దీనికి ఏ ఒక్క కంపెనీతోనూ సంబంధం లేదనీ, చేతనైతే యింట్లోకూడా దీన్ని తయారుచేసికోవచ్చనీ ఆయన స్పష్టపరిచారు.

తరువాత ఇంకా కొంచెంసేపు తర్జన భర్జనలు జరిగినమీదట, సమావేశంవారు, ఈ క్రింది తీర్మానాలను ఆమోదించారు.

(1) అఖిలభారత నశ్యమహాసభ అనే పేరుతో, ఈసంస్థ రిజిస్టరుచేయింపబడాలి.

(2) మహాసభ తాలూకు ఒక ఉప సంఘం పత్రికాధిపతులను కలసికొని, ఇట్టి సంస్థల ఆవశ్యకతను గూర్చి కనీసం ఒక 'సబ్-లీడరు' అన్నా వ్రాయించవలసిందిగా కోరాలి.

(3) నశ్యపు డబ్బీలు క్వినైనుబిళ్ళలవలె, ప్రతి పోస్టాఫీసులోను లభించేటట్లు, ప్రభుత్వం సబబైన ధరలను నిర్ణయించి, ఏర్పాటు చేయించాలి.

(4) వివిధకంపెనీల నశ్యప్రాశస్త్యాన్నీ, *Comparative Study* (తారతమ్య పరిశీలన) చేసే ఒక వ్యాసరచనా పోటీ ప్రతి సంవత్సరం జరిపి, ఉత్తమ రచయితను ప్రభుత్వం తగురీతిగా సత్కరించాలి.

(5) నశ్యపు ప్రమాణాన్ని వృద్ధిచేసేందుకై (*For increasing the Standaard of snuff*) రిసెర్చి సాగించేందుకు, ప్రభుత్వం ఏటా గ్రాంటులు మంజూరు చేయించాలి.

హాచ్! హాచ్! అంటూ ముందు అధ్యక్షులవారూ వారివెంట సభ్యులు దిక్కులు మారుమూగేలా జయధ్వానాలు చేయగా సభ జయప్రదంగా ముగిసింది. ★




